

సమీకృతం.. ఎంతో జాప్యం
పట్టణాల్లో మాంసం, కూరగాయల విక్రయాలు ఒకేచోట జరిగేలా ప్రభుత్వం సమీకృత మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 8లో



స్లాట్ కాదు.. సదరం రాదు..
దివ్యాంగులు పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాలంటే వైకల్యం ఎంత ఉందో నిర్ధారించే సదరం ధ్రువీకరణ తప్పనిసరి. 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.0/23.0
వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉన్నా.. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గొల్లపల్లి: పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి

ధర్మపురి: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆది వారం నియోజకవర్గంలోని 120మంది ముస్లింలకు చెక్కులు పంపిణీ చేశారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలోని దమ్మన్నపేటకు చెందిన ముదిరాజు కులస్తులు పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వైస్ చైర్మన్ రామన్న, ఎంపీపీ, జెడ్పీటీసీలు ఎడ్ల చిట్టిబాబు, బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ ఉన్నారు.

బుగ్గారంలో పర్యటించిన మంత్రి
బుగ్గారం: మంత్రి కొప్పుల మండలంలోని 8 గ్రామాల్లో పర్యటించారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్, పలు సంఘ భవనాలను ప్రారంభించారు. శెకెల్లలో పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఎదురు బోర్ల ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి మంత్రి ఈశ్వర్ శంకుస్థాపన చేయడంపై బుగ్గారం గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ రాజేందర్, ఎంపీపీ రాజమణి, వైస్ ఎంపీపీ సుచేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలన్నీ అబద్ధాలే
వెల్గటూర్: కాంగ్రెస్ నేతలు చెబుతునవన్నీ అబద్ధాలేనని మంత్రి అన్నారు. మండలంలో రూ.2.5కోట్లతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. 40ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇప్పుడేం చేస్తుందని ప్రశ్నించారు. ఎంపీపీ లక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్ గోలి రత్నాకర్, ఏఎంసీ చైర్మన్ వెంకటేష్, దొరిశెట్టి వెంకటయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు
గొల్లపల్లి: మండలంలోని చిల్వకోడూర్‌లో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన అల్లాడి వే ణు, ఏదుల గంగయ్య పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఎంపీటీసీ మహబూబ్, నాయకులు పాల్గొన్నారు.

మండలంలో మంత్రి సుడిగాలి పర్యటన
పెగడపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మంత్రి ఆదివారం రాత్రి సుడిగాలి పర్యటన చేశారు. ఎల్లాపూర్‌లో రూ.కోటితో సీసీరోడ్లు, నర్సింహునిపేటలో రూ.25 లక్షలతో నిర్మించిన జీపీ భవనం, సుద్దపల్లి, వెంగళాయిపేటలో సీసీరోడ్లు, పీహెచ్‌సీకి సమకూర్చిన అంబులెన్స్‌ను మంత్రి ప్రారంభించారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



చల్‌గల్‌లో పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈవో

జగిత్యాలరూరల్: గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ రఘువరన్ అన్నారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్‌లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను తనిఖీ చేశారు. గ్రామాల్లో మురికికాలువలు శుభ్రం చేయించాలని, దోమల బెడద లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో అయిల్ బాల్స్ వేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులపై కూడా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ కనకదుర్గ, ఎంపీడీవో రాజేశ్వరీ, సర్పంచ్ ఎల్ల గంగనర్సు పాల్గొన్నారు.

యూజీడీపై ఆశలు..!



జగిత్యాల పట్టణం

- మంత్రి కేటీఆర్ హామీతో ప్రజల్లో ఆనందం
- గతంలో ప్రతిపాదనలకే పరిమితం

జగిత్యాల: జిల్లా కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. వీధులన్నీ ఇరుకుగా ఉండడంతో నాలాలు విస్తరించలేకపోతున్నారు. ఈ క్రమంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు బీజం పడింది. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి యూజీడీ చేస్తామన్న హామీతో ప్రజల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. యూజీడీ ఏర్పాటుకు మంత్రి కేటీఆర్ ఈనెల 3న మినీస్టేడియంలో జరిగిన బహిరంగ సభలో హామీ ఇవ్వడంతో ఆశలు రేకెత్తుతున్నాయి. గతంలోనే దీనికి ప్రతిపాదనలు రూపొందించినప్పటికీ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చొరవ తీసుకుని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.

2017లోనే బీజం
జగిత్యాల జిల్లాకేంద్రంగా రూపుదిద్దుకున్న అనంతరం 2017లో జిల్లాకేంద్రంతోపాటు మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపాలిటీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వరద కాలువ నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అప్పుడు బల్దియా అధికారులు ఇంజినీరింగ్ చీఫ్ (హైదరాబాద్)కు లేఖ అందించారు. ఈ మేరకు అధికారులు కూడా కసరత్తు చేపట్టారు. అప్పట్లో జగిత్యాల మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు దాని రూపకల్పనకు హైదరాబాద్‌కు చెందిన యూటర్న్ కన్సల్టెన్సీకి అందజేశారు. ఇందుకోసం రూ.25 లక్షలు కూడా కేటాయించారు. సర్వే దాదాపు 90 శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు. యూజీడీకి రూ.100 కోట్లు, వరద కాలువ నిర్మాణానికి మరో రూ.100 కోట్లు కేటాయిస్తామని ప్రకటించారు.

మారనున్న రూపురేఖలు
జగిత్యాలలో ప్రస్తుతం డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. వర్షకాలం అయితే ఇళ్లల్లోకి మురికినీరు వస్తోంది. ప్రస్తుతం అండర్ డ్రైనేజీ చేపడితే జిల్లాకేంద్రం రూపురేఖలు మారనున్నాయి. ప్రస్తుతం జిల్లాకేంద్రం 5నుంచి 8 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. 25 వేల ఇళ్లు పైగా ఉన్నాయి. లక్షకు పైగా జనాభా కలిగి ఉంది. ఒకవేళ అండర్ డ్రెయినేజీ సిస్టమ్ అమలులోకి వస్తే జగిత్యాల సిటీ సుందరంగా రూపుదిద్దుకుంటుంది.

చర్యలు తీసుకుంటాం



జిల్లా కేంద్రంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా ఏర్పాటు చేసేందుకు హామీ ఇచ్చారు. ప్రణాళిక రూపొందించేందుకు చర్యలు చేపడతాం.
– సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే



అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నమూనా

సర్కార్ బడులకు మహర్దశ



జగిత్యాలరూరల్: శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: మన ఊరు–మన బడి కార్యక్రమంతో సర్కారు బడులకు మహర్దశ పట్టిందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో రూ.కోటితో తాటిపల్లి బైపాస్‌కు, మన ఊరు–మన బడి కింద జెడ్పీ పాఠశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సీఎం కేసీఆర్ గ్రామ పంచాయతీలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠదామాలు, మౌలిక వసతుల కల్పనకు నిధులు వెచ్చిస్తున్నారని అన్నారు. ఏఎంసీ చైర్మన్ నక్కల రాధ, రైతుబంధు మండల కన్వీనర్ రవీందర్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ ఉన్నారు.

బీర్‌పూర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం
సారంగాపూర్: బీర్‌పూర్ మండలకేంద్రం కావడంతో గణనీయమైన అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. బీర్‌పూర్‌లోనే ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. మండల విద్యావనరుల కేంద్రాన్ని ప్రారంభించారు. రూ.20 లక్షలతో పైప్‌లైన్, తుంగూర్ నుంచి దొంతాపూర్ వరకు రూ.1.80 కోట్లతో బీటీ రోడ్డు, రూ.17 లక్షలతో కల్యాణమండపం, రూ.25 లక్షలతో పీహెచ్‌సీ భవనం, తాళ్లధర్మారంలో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు, మంగేళలో రూ.5లక్షలతో కల్యాణమండపం నిర్మాణ పనులు ప్రారంభించారు.



రాయికల్: పార్టీలో చేరుతున్నవారితో ఎమ్మెల్యే

ముప్పాల రాంచందర్‌రావు, బల్మూరి లక్ష్మణ్‌రావు, కొల్ముల రమణ, ముక్క శంకర్, సర్పంచ్‌లు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా
రాయికల్: బీఆర్‌ఎస్ పార్టీలోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం రాయికల్ మండలం బోర్నపెల్లి, చింతలూర్ గ్రామానికి చెందిన వంద మంది ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో యువతకు పెద్దపీట వేస్తున్నామని, సీఎం కేసీఆర్ అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. పార్టీ పటిష్టత కోసం కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కోల శ్రీనివాస్, సర్పంచులు పాదం లతారాజు, అనుపురం శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ కవిత, నాయకులు రవీందర్, రాగుల స్వామి, ప్రవీణ్, మల్యాల మధు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ‘ఉపాధి’ సభలు

- ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు
- పనులు నివేదించనున్న సామాజిక తనిఖీ బృందం
- కేంద్రం ఆమోదిస్తే డిసెంబర్ నుంచి కూలీలకు పనులు



పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

జగిత్యాలరూరల్: జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2024–25 సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో చేపట్టే పనులు గుర్తించేందుకు జిల్లాలో గ్రామసభలు నిర్వహిస్తున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించేందుకు ఎలాంటి పనులు గుర్తించాలి..? ఏయే గ్రామాల్లో ఎలాంటి పనులు చేయించాలి..? అనేది అధికారులు ఇప్పటికే గ్రామస్థాయిలో ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఎంపీడీఓలు, ఎంపీఈఓలు, ఏపీఓలు, ఈసీలు, టీఏలు గ్రామసభల్లో పాల్గొని పనులపై చర్చించి పనులు ఎంపిక చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో గుర్తించిన పనులను ఆ సభల్లోనే ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు నివేదిక చదివి ఆమోదం పొందారు. ఆ తరువాత ఇంజినీరింగ్ కన్సల్టెంట్ అందుకు సంబంధించి ఎస్టిమేట్స్ వేస్తారు. ఎన్ని పనిదినాలు చేపట్టాలనేది కూడా ఆయా గ్రామసభల్లోనే ప్రస్తుతం ఉన్న జాబ్ కార్డుల ఆధారంగా గుర్తించాల్సి ఉంది. నవంబర్ వరకు జిల్లాలోని 380 గ్రామాల్లో సభలు నిర్వహించి నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తారు. కేంద్రం నుంచి ఆమోదం పొంది వచ్చిన తరువాత డిసెంబర్ నుంచి ఉపాధి కూలీలకు గ్రామాల్లో పనులను కల్పించనున్నారు.

చేసిన పనుల వివరాలు తెలపాల్సిందే..
2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి నిధుల ద్వారా చేసిన ప్రతి పని వివరాలు పని ప్రదేశం, పనిదినాలు, ఖర్చులను తెలుపుతూ గ్రామసభలో వివరాలు చదివి వినిపిస్తున్నారు. ప్రస్తుతం మంజూరై పని మొదలుపెట్టని వాటి వివరాలు గ్రామసభలో చర్చిస్తున్నారు. అలాగే ఈ సంవత్సరంలో పనులు చేసిన కుటుంబాల కూలీల వివరాలు చదివి, పనిచేసిన వారి జాబ్ కార్డులు మొత్తం అప్‌డేట్ చేసినట్లు ప్రకటించి తప్పనిసరిగా మినిట్స్ నమోదు చేస్తున్నారు. అలాగే ఈ–గ్రామ పంచాయతీలో ఈ సంవత్సరం హరితహారం పనుల కింద మొక్కలు నాటిన పని ప్రదేశాల వివరాలు వాటి ఖర్చు వివరాలు పొందుపరుస్తున్నారు. 2022–23 సంవత్సరం నర్సరీల్లో పెంచిన మొక్కలు, నాటిన, పంపిణీ చేసిన మొక్కల వివరాలు నర్సరీల్లో పెంచే మొక్కల వివరాలు చర్చించి మినిట్స్ నమోదు చేస్తున్నారు. అలాగే పచ్చదనం పెంపుదల ఆవశ్యకత, పరిసరాల పరిశుభ్రతకు తీసుకున్న చర్యల గురించి తప్పనిసరిగా గ్రామస్తులకు వివరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రకారంగా గ్రామ సభల నిర్వహణకు అధికారులు చేపడుతున్నారు.

పనుల ఎంపికపై గ్రామసభలు



గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలకు పని కల్పించేందుకు 2023–24 సంవత్సరానికి సభలు నిర్వహించి పనులు ఎంపిక చేస్తున్నాం. ప్రతి గ్రామపంచాయతీల్లో కూలీలతో గ్రామసభలు పెట్టి ఎంపిక చేసిన పనులను అవసరమైన కూలీల సంఖ్యను గ్రామసభల్లో వివరిస్తాం.
– నరేశ్, డీఆర్డీఏ పీడీ

2023-24 సంవత్సరంలో ఉపాధిహామీ పనులు వివరాలు

కూలీల సంఖ్య	2.73 లక్షలు
జాబ్‌కార్డులు	1.67 లక్షలు
పనిదినాల లక్ష్యం	46.35 లక్షలు
కల్పించిన పనిదినాలు	23 లక్షలు
వికలాంగ కూలీలు	671
వందరోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలు	130



మోరపల్లిలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

జిల్లా సంక్షేమశాఖ అధికారిగా భాస్కర్



కలెక్టర్‌ను కలిసిన సంక్షేమ అధికారి

జగిత్యాల: జిల్లా సంక్షేమ శాఖ అధికారిగా ఆడెపు భాస్కర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి జిల్లా పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులుకులుగా పనిచేసిన భాస్కర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. అనంతరం ఆయన కలెక్టర్ యాస్మిన్‌బాషాను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఇప్పటికి వరకు జిల్లా సంక్షేమ శాఖ అధికారిగా పనిచేసిన బోనగిరి నరేష్ జిల్లా పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులుగా కొనసాగనున్నారు.

క్లుప్తంగా

పేదలకు నాణ్యమైన వైద్యం



బోటు నడుపుతున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లి: పేదలకు నాణ్యమైన వైద్యం అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తెలిపారు. పట్టణంలోని ఐదువార్డుల్లో నిర్మించే హెల్త్ సబ్ సెంటర్ల పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు రూ.కోటితో సబ్ సెంటర్లను నిర్మిస్తామన్నారు. బీఆర్‌ఎస్ ప్రజల ఆరోగ్యానికి అధిక నిధులు కేటాయిస్తోందని పేర్కొన్నారు. అనంతరం పట్టణ శివారులోని పెద్ద చెరువులో బోటు షికారును ప్రారంభించి బోటును నడిపారు.

అగ్ని ప్రమాద స్థలం పరిశీలన



అగ్ని ప్రమాదాన్ని పరిశీలిస్తున్న విజయ్

కోరుట్ల: ఆర్టీసీ కోరుట్ల డిపోకు చెందిన రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో ఆదివారం అగ్ని ప్రమాదం జరగగా ఘటనా స్థలాన్ని కాంగ్రెస్ నాయకులు జువ్వాడి నర్సింగరావు, కొమొరెడ్డి విజయ్ ఆజాద్ పరిశీలించారు. బస్సులో అగ్ని ప్రమాదం జరగడం దురదృష్టకరమన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పదేళ్లుగా ఎమ్మెల్యేగా కొనసాగుతున్నా.. పట్టణంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయించకపోవటం సిగ్గు చేటన్నారు. నాయకులు తిరుమల గంగాధర్ గౌడ్, నయీం, బాజన్న, కటుకం చంద్రశేఖర్, సురభి అశోక్, ఖలీద్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

మారుతినగర్ శివారులో లారీ, కారు ఢీ

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మారుతినగర్ శివారులో లారీ కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. కారు ముందు వైపు భాగం ధ్వంసంకాగా అందులో ప్రయాణిస్తున్న ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా.. గాయపడిన వ్యక్తిని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన కొద్దిసేపటి వరకు మెట్‌పల్లి–కోరుట్ల మధ్యలో జాతీయ రహదారిపై ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

అదృశ్యమైన వృద్ధుడి మృతదేహం లభ్యం

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్‌కు చెందిన అయిత వెంకన్న(65) ఈనెల 4న జగిత్యాల కొత్త బస్టాండ్‌లో అదృశ్యమయ్యాడు. ఆదివారం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పొట్యాల గ్రామ శివారులోని ఎల్లంపల్లి బ్యాక్ వాటర్‌లో శవమై కనిపించాడు. మృతుడి కుమారుడు నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

సమీకృతం.. ఎంతో జాప్యం

- ఐదు పట్టణాల్లో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లకు నిధులు
- రెండేళ్ల క్రితమే పనులకు శ్రీకారం
- ఎక్కడా వినియోగంలోకి రాని వైనం



'ఈ చిత్రంలో కనిపిస్తున్నది మెట్‌పల్లి పట్టణంలోని ఖాదీ ప్రతిష్టాన్‌కు చెందిన స్థలంలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ భవనం. 2021 జూన్‌లో ఈ పనులకు శంకుస్థాపన చేశారు. కొంతవరకు పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్.. తర్వాత నిలిపివేశాడు. కొన్ని నెలలుగా ఎక్కడి పనులు అక్కడే అన్నట్లు ఉన్నాయి. ఇప్పటికే పూర్తయి మార్కెట్ వినియోగంలోకి రావాలి. పనుల్లో జాప్యంతో ఎప్పటికీ పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.'

మెట్‌పల్లి: పట్టణాల్లో మాంసం, కూరగాయల విక్రయాలు ఒకేచోట జరిగేలా ప్రభుత్వం సమీకృత మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ వ్యాపారాలను వేర్వేరు ప్రదేశాల్లో వసతులు లేనిచోట నిర్వహిస్తుండడం వల్ల అటు వ్యాపారులు, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ఒకేచోట అన్ని వసతులతో ఉండేలా సమీకృత మార్కెట్లను ఏర్పాటు చేస్తోంది. జిల్లాలోని మున్సిపాలిటీల్లో రెండేళ్ల క్రితం వీటి పనులకు శ్రీకారం చుట్టింది. కానీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో మార్కెట్లు ఇంకా వినియోగంలోకి రాలేదు.

జిల్లాకు రూ.26.50కోట్లు మంజూరు

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.26.50కోట్లు మంజూరు చేసింది. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు రూ.6.50కోట్ల చొప్పున, ధర్మపురికి రూ.4కోట్లు, రాయికల్‌కు రూ.3కోట్లు కేటాయించారు.

ఒక్క ధర్మపురిలోనే పూర్తి..

ఐదు పట్టణాల్లో మార్కెట్ల నిర్మాణ పనులను పబ్లిక్ హెల్త్ విభాగం పర్యవేక్షిస్తుంది. అయితే ఇప్పటివరకు ఒక్క ధర్మపురిలో మాత్రమే పనులు పూర్తి కాగా.. దాని నిర్వహణ బాధ్యతలను మున్సిపాలిటీకి అప్పగించారు. తొందరలోనే ఇది వినియోగంలోకి రానుంది. మెట్‌పల్లిలో నిర్మాణ పనులు కొన్ని నెలల క్రితం నిలిచిపోయాయి. ఇక్కడ పైకప్పును సిమెంట్‌తో నిర్మిస్తుండడంతో ఆదనంగా మరికొన్ని నిధుల కోసం ప్రతిపాదనలు పంపారు. అవి రాగానే పనులను తిరిగి మొదలుపెడుతామని అధికారులు చెబుతున్నారు. కోరుట్లలో ఇప్పటివరకు 60శాతం మాత్రమే పనులు కాగా.. జగిత్యాలలో తుది దశకు చేరుకున్నాయి. రాయికల్ పట్టణంలో స్థల సమస్య వల్ల ఇంకా అక్కడ పనులే ప్రారంభం కాలేదు.

బిల్లుల చెల్లింపుల్లో జాప్యం..

- మార్కెట్ల నిర్మాణ పనులు వేగంగా సాగకపోవడానికి బిల్లుల చెల్లింపుల్లో జాప్యమే కారణమని తెలిసింది. ప్రభుత్వం సకాలంలో బిల్లులను చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనుల్లో జాప్యం చేయడం..నిలిపివేయడం చేస్తున్నారు. వాస్తవానికి ఇప్పటికే ఐదుచోట్ల పనులు పూర్తయి మార్కెట్లు వినియోగంలోకి రావాల్సి ఉంది. కానీ పలు కారణాలతో ఒక్కచోట కూడా వినియోగంలోకి రాకపోవడం గమనార్హం.

కాంట్రాక్టర్లకు సూచించాం

సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించాం. ధర్మపురిలో పనులు పూర్తి కావడంతో దానిని మున్సిపాలిటీకి అప్పగించాం. రాయికల్‌లో స్థల సమస్య ఉంది. మిగతా మూడు చోట్ల పనులను తొందరలోనే పూర్తి చేస్తాం. – సంపత్‌రావు, ఈఈ

'గ్యారంటీ' పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్:కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాలతోపాటు తాజాగా ప్రకటించిన గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరాభవన్‌లో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడాలని కోరారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

మొక్కజొన్న కొనుగోలుకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కేంద్రాలు ఏర్పాటు చేయాలని జీవన్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. బహిరంగ మార్కెట్‌లో మద్దతు ధర రాక రైతులు నష్టపోతున్నారని తెలిపారు.

అండగా ఉంటా ఆశీర్వదించండి

రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తే అండగా ఉంటానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఒకటో వార్డులో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో తనకు అండగా నిలవాలని కోరారు.

మాటకు కట్టుబడి పసుపు బోర్డు ఏర్పాటు



పసుపుమొక్కలతో రైతుల సంబరాలు

కథలాపూర్(వేములవాడ): కేంద్రప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పసుపు బోర్డు ఏర్పాటుకు ముందుకొచ్చిందని బీజేపీ నాయకురాలు తుల ఉమ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో బీజేపీ నాయకులు పసుపు మొక్కలతో సంబరాలు నిర్వహించారు. ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. తెలంగాణలో రైతులు ఎక్కువగా పసుపు పంటను సాగుచేస్తారని, పసుపు బోర్డుకు ప్రధాని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని తెలిపారు. మెట్‌పల్లిలోని ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ తెరిచి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. చక్కెర ఫ్యాక్టరీని తెరవకపోతే రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి చరమగీతం పాడటం ఖాయమన్నారు. కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, ఎద్మల వినోద్‌రెడ్డి, కంటె సత్యనారాయణ, తిరుమల్‌రెడ్డి, నరెడ్ల రవీందర్‌రెడ్డి, శ్రీరాముల ప్రకాశ్, బెజ్జారపు శివరాం, తుమ్మనపెల్లి మహేశ్, కిశోర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకొస్తేనే పేదలకు మేలు

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి:కాంగ్రెస్ అధికారంలోకొస్తేనే పేదలకు మేలు జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు, ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండలంలోని నంచర్లలో ఆదివారం రాత్రి పర్యటించారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే చేసే అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం తదితర హామీలు తుంగలో తొక్కిందని ఆరోపించారు. కాంగ్రెస్ అమలు చేయనున్న ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు కుంటాల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సింగాపూర్‌లో గ్రామస్తుల ఆందోళన



ఆందోళన చేస్తున్న నర్సింగాపూర్ గ్రామస్తులు

జగిత్యాలరూరల్: రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామస్తులు శనివారం రాత్రి తీవ్ర ఆందోళనకు దిగారు. నూకపల్లి శివారులో జగిత్యాల మున్సిపాలిటీకి డంపింగ్‌యార్డును ఏర్పాటు చే శారు. యార్డులో చెత్తను కాల్చేందుకు నిప్పు పెట్టడంతో భారీగా పొగ వ్యాపించడంతో నర్సింగాపూర్‌లో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఆరుబయటకు వచ్చి ఆందోళన చేపట్టారు. పొగ తీవ్రంగా కమ్ముకోవడంతో ఎంపీటీసీ మహేశ్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు సమాచారం అందించారు. ఆయన ఆదేశాల మేరకు జగిత్యాల మున్సిపల్ సిబ్బంది ఫైరింజన్‌ను తెప్పించి డంపింగ్‌యార్డులో మంటలు ఆర్పి పొగలను నివారించారు.

ఏఈవోల కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన జిల్లా ఏఈఓల కార్యవర్గం

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా భూక్య సురేందర్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా అయ్యోరి వినోద్, కోశాధికారిగా సమల్ల భూమేశ్, అసోసియేట్ అధ్యక్షుడిగా కాసర్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కట్ట శ్రీనివాస్, ఏ.మంజుల, ఎండీ.ఫిర్‌దోస్, ఐ.సుమలత, పబ్లిసిటీ సెక్రటరీగా జి.శేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.కారుణ్య కుమార్ ఎన్నికయ్యారు.

అస్రా జిల్లా లీగల్ కో–ఆర్డినేటర్‌గా రాజేంద్రప్రసాద్



కటుకం రాజేంద్రప్రసాద్

కోరుట్ల: అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ, అవేర్‌నెస్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ జిల్లా లీగల్ కో–ఆర్డినేటర్‌గా పట్టణానికి చెందిన న్యాయవాది కటుకం రాజేంద్రప్రసాద్‌ను నియమించినట్లు వ్యవస్థాపకులు హబీబ్ సుల్తానా తెలిపారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆర్గనైజేషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన కల్పిస్తూ వారి హక్కులకు భంగం కలిగినప్పుడు నష్ట పరిహారం అందేలా కృషి చేస్తానన్నారు. రాజేంద్రప్రసాద్ నియామకంపై చీఫ్ అడ్మినిస్ట్రేటీవ్ మేనేజర్ శివకుమార్, జిల్లా అధ్యక్షుడు గట్ల ప్రకాశ్ హర్షం వ్యక్తం చేశారు.

పరిశుభ్రతతోనే రోగాలు దూరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా అధికారి

సారంగాపూర్: వ్యక్తిగత పరిశుభ్రతతోనే రోగాలు దూరమవుతాయని జిల్లా సమగ్రశిశు సంరక్షణాధికారి డాక్టర్ జయపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పెంబట్ల బుడిగజంగాల కాలనీలో మండల వైద్యశాఖ ఆధ్వర్యంలో జ్వరాలు, ఇతర వ్యాధులపై ఇంటింటా సర్వే నిర్వహించారు. రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని, మురికికాల్వల్లో నీరు చేరకుండా, బావుల్లో క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డుపల్లి రాజన్న, వైద్య సిబ్బంది ఉన్నారు.

మహిళ ఆత్మహత్య



భీమక్క మృతదేహం

జగిత్యాలక్రైం:జగిత్యాలరూరల్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన కాముని భీమక్క (57) కొంత కాలంగా మానసిక స్థితి సరిగ్గా లేక శనివారం రాత్రి ఊర చెరువులో పడి ఆత్మహత్యకు పాల్పడింది. భీమక్కకు చిన్నతనంలోనే వివాహమైంది. విడాకులు కావడంతో ఆమె సోదరుడి వద్దనే ఉంటోంది. ఆరేళ్లుగా మానసికంగా ఒత్తిడికి గురై మతిస్థిమితం లేకుండా ప్రవర్తించేది. ఆసుపత్రిలో చూపించినా ఆమె ఆరోగ్యం కుదటపడలేదు. శనివారం రాత్రి కుటుంబసభ్యులంతా నిద్రపోయిన తర్వాత ఇంటి సమీపంలో ఉన్న ఊర చెరువులో పడి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి సోదరుడు కాముని లింగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

స్లాట్ కాదు.. సదరం రాదు..

- దివ్యాంగుల అవస్థలు
- మీ సేవ కేంద్రాల వద్ద క్యూ
- మూడు, నాలుగు స్లాట్లతోనే సైట్ క్లోజ్

అక్టోబర్‌లో సదరం క్యాంపు నిర్వహించే తేదీలు, స్థలం

శారీరక వైకల్యం	: ఈనెల 13, 18, 26
స్థలం	: జిల్లాకేంద్ర ఆసుపత్రి
మానసిక వైకల్యం	: ఈనెల 20
స్థలం	: జిల్లాకేంద్ర ఆసుపత్రి
కంటి రుగ్మత	: ఈనెల 31
స్థలం	: మాతాశిశు హాస్పిటల్ (న్యూ) ధరూర్ క్యాంపు జగిత్యాల
వినికిడి లోపం	: ఈనెల 11
స్థలం	: జిల్లాకేంద్ర ఆసుపత్రి



పెగడపల్లి మీసేవ కేంద్రం సదరం స్లాట్ బుకింగ్ కోసం వేచి ఉన్న దివ్యాంగులు

పెగడపల్లి: దివ్యాంగులు పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాలంటే వైకల్యం ఎంత ఉందో నిర్ధారించే సదరం ధ్రువీకరణ తప్పనిసరి. ఆ సదరంపత్రం కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయాల్సి ఉంటుంది. పరీక్షలకు హాజరయ్యేవారు స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. ఇది ప్రతినెలా 2న లేదా.. 3న మీసేవ కేంద్రాల్లో చేస్తారు. ఆ సమయంలోనే దివ్యాంగులు స్లాట్ బుకింగ్ చేయించుకుని తమకు వచ్చిన తేదీల్లో జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి వెళ్తే వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

ఇద్దరు ముగ్గురికే స్లాట్..

సదరం స్లాట్ బుకింగ్ పోర్టల్ ఉదయం 11 గంటలకు తెరుచుకుని కేవలం 15 నిమిషాలపాటే పనిచేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. అది కూడా సైట్ స్లోగా రావడంతో ఒక్కో మీసేవ కేంద్రంలో కేవలం మూడు, నాలుగు మాత్రమే బుక్ అవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో వందలాది మంది నిరాశకు గురవుతున్నారు. ప్రతినెలా ఇలాగే జరుగుతోందని, ముగ్గురికి మించి స్లాట్‌బుకింగ్ కావడం లేదని చెబుతున్నారు. కాళ్లు, చేతులు సరిగ్గా లేని వారు, మానసిక దివ్యాంగులు, బుద్ధిమాంద్యం గల వారు, అంధులు, వినికిడి లోపం ఉన్నవారు అనేక మంది తిండితిప్పలు లేక అవస్థలు పడుతూ దూర ప్రాంతం నుంచి మండలకేంద్రంలో ఉన్న మీసేవ కేంద్రాల వద్దకు వచ్చిన వారు రాత్రివరకూ ఉంటూ ఇంటిదారి పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి స్లాట్‌బుకింగ్ సమయం పెంచాలని కోరుతున్నారు.

నాలుగు నెలలుగా తిరుగుతున్న



నాకు చిన్ననాటి నుంచే రెండు కాళ్లు పనిచేయడం లేదు. దివ్యాంగుల పరీక్షలు చేయాలంటే సదరం స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సింది. సదరం స్లాట్ బుకింగ్ కోసం గత నాలుగు నెలలుగా మీ సేవ కేంద్రం చుట్టూ తిరుగుతున్న. స్లాట్ దొరుకతలేదు. – గన్నవేని అఖిల్, మద్దులపల్లి

ఆర్నెళ్లకు స్లాట్ దొరికొంది



ఆర్నెళ్లుగా సదరం స్లాట్ బుకింగ్ కోసం తిరుగుతున్నా. ఐదు నెలలుగా స్లాట్ దొరకలేదు. ఈనెల మూడున స్లాట్ బుకింగ్ కోసం వస్తే ఆరోసారికి స్లాట్ దొరికింది. నాలాంటి వారు చాలామంది మీసేవ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. – బాలుసాని మల్లవ్వ, బతికపల్లి

బావిలో పడి గొర్రెల కాపరి మృతి

పెగడపల్లి:మండలంలోని సుద్దపల్లిలో గొర్రెల కాపరి సిద్దుల గంగయ్య (65) ఆదివారం ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. గొర్రెలను మేపేందుకు వెళ్లిన గంగయ్య కనపడకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయన కోసం వెదకగా బావిలో మృతదేహం కనిపించింది. దాహం తీర్చుకునేందుకు బావి వద్దకు వెళ్లిన గంగయ్య ప్రమాదవశాత్తున్న కాలుజారి బావిలో పడి మృతి చెందాడని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

పెగడపల్లి: మండల కేంద్రానికి చెందిన రాధ భూమయ్య (57) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. మద్యానికి బానిసైన భూమయ్య తాగిన మైకంలో ఈనెల 5న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆటో, బైక్ ఢీ.. పలువురికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని ఇప్పలపల్లె శివారులో ఆదివారం ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. మల్యాల గ్రామానికి చెందిన పేరాల దిలీప్ తన స్నేహితుడు శ్రీనివాస్ ద్విచక్రవాహనంపై కాల్వశ్రీరాంపూర్ నుంచి మల్యాలకు వెళ్తుండగా జమ్మికుంట నుంచి కాలవ్రశ్రీరాంపూర్ వైపు వస్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈఘటనలో దిలీప్ కుడిచేయి, కుడి కాలు, శ్రీనివాస్ తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గురిజాల జనార్దన్‌రెడ్డి, అతడి భార్య భాగ్యలక్ష్మి, మారెడుగొండకు చెందిన అల్లోల శ్రీనివాస్‌కు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులకు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు.

జేసీబీ దొంగల ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు

కరీంనగర్‌రూరల్: జేసీబీలను సైతం క్షణాల్లో మాయం చేసే ఘరానా దొంగల ముఠాను కరీంనగర్‌రూరల్ పోలీసులు సీసీ కెమెరాల సాయంతో పట్టుకున్నారు. పట్టుకున్న జేసీబీ దొంగల వివరాలను రూరల్ ఏసీపీ తాండ్ర కరుణాకర్‌రావు ఆదివారం విలేకరుల సమావేశంలో వివరించారు. తీగలగుట్టపల్లికి చెందిన గుంజే లక్ష్మణ్ జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తునే బ్యాంకు రుణం ద్వారా రెండు జేసీబీలు, ఒక ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. జేసీబీలు సక్రమంగా నడువక పోవడంతో బ్యాంకు కిస్తీలు కట్టలేకపోయాడు. ఒక జేసీబీని పరిచయస్తుడైన బెజ్జారం రమేశ్ ద్వారా షకీల్ అనే వ్యక్తికి విక్రయించాడు. ముగ్గురికి పరిచయం బాగా పెరిగిన క్రమంలో ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో లక్ష్మణ్ హైదరాబాద్‌కు మకాం మార్చి కారుడ్రైవర్‌గా చేరాడు. కరీంనగర్‌లో జేసీబీలను దొంగతనం చేసి హైదరాబాద్‌లో విక్రయించాలనే ఆలోచనతో తన డ్రైవర్ యాకాంబరం, మురళిలతో కలిసి లక్ష్మణ్ కొత్తపల్లి పెట్రోల్‌బంకులో ఉన్న జేసీబీని గతనెల 11న దొంగిలించేప్రయత్నం చేశాడు. యజమాని లింగమూర్తి వెంబడించడంతో విడిచిపెట్టి పారిపోయారు. మరుసటిరోజు 12న గోపాల్‌పూర్‌లో ఎర్ర రామకృష్ణకు చెందిన జేసీబీని దొంగలించి హైదరాబాద్‌కు పోయారు. గత నెల 30న కరీంనగర్‌కు వచ్చిన లక్ష్మణ్, మురళీలు ఏకాంబరంతో కలిసి తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలోని వేల్పుల గోపాల్‌కు చెందిన జేసీబీని ఎత్తుకెళ్లారు. రమేశ్ ద్వారా షకీల్‌కు విక్రయించి కమీషన్ డబ్బులను పంచుకుంటున్నారు. జేసీబీ దొంగలపై ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు గుంజే లక్ష్మణ్, తుర్కా మురళీ, అలకుంట ఏకాంబరం, బెజ్జారం రమేశ్, కోట్ల షకీల్‌ను అరెస్ట్ చేశారు. దొంగల నుంచి రెండు జేసీబీలను స్వాధీనం చేసుకున్నారు. జేసీబీ దొంగతనం కేసును చేధించిన సీఐ ప్రదీప్‌కుమార్, ఎస్సై రాజు, హెడ్‌కానిస్టేబుల్ అశోక్, రమేశ్, దయానంద్‌ను ఏసీపీ అభినందించారు.

విషాదం మిగిల్చిన బర్త్ డే వేడుకలు

- ఎల్లంపల్లి ప్రాజెక్టులో యువకుడి గల్లంతు



గల్లంతైన ధర్మతేజ

రామగుండం: ఎన్టీపీసీకి చెందిన ఐదుగురు యువకులు బర్త్ డే పార్టీ కోసం సరదాగా ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వచ్చి మద్యంతో వేడుకలు జరుపుకోగా కొద్దిసేపట్లోనే సరదా కాస్త విషాదంగా మారింది. అంతర్గాం ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. ఎన్టీపీసీకి చెందిన ఐదుగురు యువకులు బర్త్‌డే పార్టీ పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం కారులో మద్యం బాటిళ్లతో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు చేరుకున్నారు. ఐదుగురు యువకులు అధికంగా మద్యం సేవించి ప్రాజెక్టులో స్నానం చేసేందుకు నదిలోకి దిగారు. అందులో ఎవరికీ ఈత రాదు. ముగ్గురు వ్యక్తులు ఒడ్డుకు దగ్గరగా స్నానం చేస్తుండగా, ఇద్దరు వ్యక్తులు కొంచెం దూరంగా నీటిలోకి వెళ్లి సరదాగా గంతులేస్తూ స్నానం చేస్తుండగా కనకమేడల ధర్మతేజ(32) నీటిలో మునిగి కనిపించకపోయాడు. కొంతసేపు పరిశీలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. మిగతా నలుగురు వ్యక్తులు ఒడ్డుకు చేరారు. కాగా అప్పటికే చీకటి పడడంతో మరుసటి రోజు గల్లంతైన యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.